సాక్షి
వరంగల్
శనివారం । 21 । జనవరి । 2023



నీవెంటే నేను! - 8లో▸
బాల్యం నుంచి కలిసిమెలిసి పెరిగారు. ఇప్పుడు 24 గంటల వ్యవధిలోనే ఇద్దరూ మృత్యు ఒడికి చేరుకున్నారు. నీవెంటే నేను అంటూ అనంత లోకాలకు వెళ్లిపోయారు.



నేటి నుంచి రీ ఓపెన్ అయ్యేనా?
కేయూలో విద్యార్థులకిచ్చిన 11 రోజుల సెలవులు శుక్రవారంతో ముగిశాయి. అయితే కామన్ మెస్, పలు హాస్టళ్లలో మరమ్మతులు ఇంకా కొనసాగుతున్నాయి. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30°/18°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక మేఘాలతో ఎండగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

23న జాబ్‌మేళా

కాశోజీ సెంటర్: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి ఈనెల 23న వరంగల్ ములుగు రోడ్డులోని ఐటీఐ క్యాంపస్ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువనాథ్ సోలిసన్స్ కంపెనీలో టెలీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా హైదరాబాద్, వరంగల్‌లో పని చేయడానికి దాదాపు 65 మంది ఎంపికకు జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకున్న వారు తమ అర్హత ధ్రువపత్రాలతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని, పూర్తి సమాచారం కొరకు 89784 93699 లేదా 99123 41819 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సత్యంకు టెర్రే ఒలింపియాడ్ అవార్డు



సంగెం: మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు డాక్టర్ శంకరభక్తుల సత్యంకు పుణేలోని టెర్రె పాలసీ సెంటర్ ఎస్‌జీఓ, కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవడేకర్ టెర్రే ఒలింపియాడ్ అవార్డును ప్రదానం చేశారు. 'ఆంగ్ల విద్యా బోధనలో వినూత్న పద్ధతులు, ప్రాజెక్టు ఆధారిత బోధనలు, విద్యార్థులకు ఆంగ్లంపై ఆసక్తిని పెంపొందించే బోధనా పద్ధతులు, నూతన విద్యావిధానం' అనే అంశాలపై సత్యంకు అవార్డు అందజేసినట్లు టెర్రె పాలసీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వినీత ఆప్టే ప్రకటించారు. కాగా.. అవార్డు అందుకున్న సత్యంను పాఠశాల హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

'మత్స్య' సభ్యత్వాలకు స్పెషల్ డ్రైవ్

గీసుకొండ: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో కొత్తగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామని, ఏప్రిల్ మొదటి వారం వరకు ఈ అవకాశం ఉందని మత్స్య శాఖ జిల్లా అధికారి నరేశ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 18 ఏళ్ల వయసు పైబడిన వారు సంబంధిత మత్స్య సంఘం వారితో సభ్యుడిగా నమోదు కోసం తీర్మానం చేయించుకుని, ఆ ప్రతులను తమకు పంపాలన్నారు. అలాంటి వారికి చెరువుల్లో వల వేయడం, పెద్ద వల లాగడం, ఈత కొట్టడం లాంటి వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తామని, అందులో ఎంపికైన వారికి సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎప్పటికీ నీరుండే పెద్ద జలాశయాలు, రిజర్వాయర్ల మత్స్య సంఘాల సభ్యత్వం కోసం వల వేయడం, పెద్ద వల లాగడం, ఈత కొట్టడంతోపాటు వల అల్లడం లాంటి నైపుణ్యాలను పరీక్షించి ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన ఒక్కొక్కరు సభ్యత్వం కోసం రూ.51 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. సంఘంలో మృతి చెందిన సభ్యుల స్థానాలను భర్తీ చేయడానికి ఇదే ప్రక్రియ ఉంటుందని ఆయన తెలిపారు.

పల్లెల్లో పశు సంపదను పెంచాలి




నెక్కొండ: గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపదను పెంచడమే లక్ష్యంగా పాడి రైతులు ముందుకు సాగాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. సూరిపల్లి జీపీ పరిధిలో శ్రీమంజునాథ గోశాల వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు లేగ దూడలను ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నెముక అని అన్నారు. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా రైతుకు భరోసా కల్పించేందుకు పశు సంపదను అందించడం ఎంతో తృప్తినిస్తుందన్నారు. ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. అనంతరం పది మంది రైతులకు రెండేసి చొప్పున 20 లేగ దూడలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగారపు గీత, ఆ సంఘం కార్యవర్గ సభ్యుడు కములేకర అరవింద్, సూపరింటెండెంట్ దుర్గం రోజా, గో రక్షణ సమితి సభ్యుడు రాము, శ్రీమంజునాథ గోశాల ప్రతినిధులు వెంకన్న, మిట్టు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహా అనుబంధానికి..
ప్రతి బంధకాలు!

గ్రేటర్ వరంగల్ నగర ప్రణాళికాభివృద్ధికి అడ్డంకులు

- అసలు సమస్యగా భూ సేకరణ
- రోడ్డుకు ఇరువైపులా భగ్గుమంటున్న భూముల ధరలు
- ఐదేళ్లు గడిచినా అడుగులు పడని వైనం
- ఓఆర్ఆర్‌తోనే నగర భవిష్యత్, మెరుగైన రవాణా సౌకర్యాలు
- పాలకులు చొరవ చూపాలని నగరవాసుల విజ్ఞప్తి



వరంగల్ అర్బన్ : రవాణా వేగవంతమైతేనే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి మార్గం సుగమమవుతోంది. నిర్మాణ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. పరిశ్రమలు, వాణిజ్య భవనాలు, సేవ రంగాలు నలుమూలల విస్తరించి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఈ నేపథ్యంలోనే వరంగల్ మహానగరం చుట్టూ నిర్మించతలపెట్టిన ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రెండు జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ రహదారుల కలయికతో నిర్మితమయ్యే ఓఆర్ఆర్‌కు భూ సేకరణ, నిధుల విడుదలపై అస్పష్టత నెలకొనడంతో ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా..
భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఔటర్ రింగ్ రోడ్డును మాస్టర్ ప్లాన్‌లో డిజైన్ చేశారు. మహానగరం చుట్టూ నాలుగు వైపులా 68 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఇది ఉంటుంది. హైదరాబాద్ రహదారి నుంచి కరీంనగర్ రోడ్డు, అక్కడి నుంచి ములుగు రోడ్డు, ఖమ్మం రోడ్డు, ఇక్కడినుంచి హైదరాబాద్ రహదారికి అనుసంధానం చేస్తారు. ఔటర్ రింగ్ రోడ్డును 200 అడుగులు.. నాలుగు లేన్లుగా డిజైన్ చేశారు. రహదారిలో గంటకు 100 కిలోమీటర్ల స్పీడ్‌తో వాహనాల రాకపోకలు కొనసాగనున్నాయి. రేడియల్ రోడ్డు సిస్టమ్ ప్రకారం అభివృద్ధి పనులు, అవసరమైన చోట సెంట్రల్ డివైడర్లు, లైటింగ్, ఆర్వోబీలు, ఇంటర్ ఛేంజ్ రోడ్లు, సర్వీసు రోడ్లను నిర్మిస్తారు. పైకి ఎక్కేందుకు, దిగేందుకు అప్, డౌన్ ర్యాంపులుంటాయి. ఈ మహోత్తర రోడ్డుకు అనుసంధానంగా కమర్షియల్ జోన్, ఇండస్ట్రియల్ జోన్, అగ్రికల్చర్ జోన్, గ్రీన్ బెల్ట్ జోన్, హెరిటేజ్ జోన్, విద్యా భవనాల జోన్లను ప్రత్యేకంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

హైవే–163 పారాహుషార్
హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి కరీంనగర్, ఏటునాగారం జాతీయ రహదారి వరకు మొదటి ప్యాకేజీ. కరుణాపురంలో మొదలై ధర్మసాగర్ శివారు, టేకులగూడెం, ఉనికిచర్ల, దేవన్నపేట, చింతగట్టు, పెగడపల్లి, వంగపహాడ్, ఆరేపల్లి, దామెర క్రాస్ రోడ్డు వరకు 29 కిలోమీటర్ల నిడివితో ఉంది. ఈ రోడ్డులో రెండున్నర ఏళ్లుగా వాహనాలు పరుగులు పెడుతున్నాయి.

భూసేకరణ లేని దామెర క్రాస్ టు సింగారం
ములుగు రోడ్డులోని దామెర క్రాస్ రోడ్డు ఎన్‌హెచ్ 163 నుంచి కొత్తపేట, మొగిలిచర్ల, బొడ్డు చింతలపల్లి, కోట వెంకటాపురం, మామూనూరు ఎయిర్‌పోర్టులోని సింగారం ఖమ్మం రోడ్డులో కలుస్తుంది. 21 కిలోమీటర్ల నిడివితో ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అందుకోసం రూ.776.54 కోట్ల నిధులు ప్రతిపాదించారు. ఇందులో 191.82కోట్లు భూసేకరణ కోసం, రహదారి పనుల కోసం రూ. 584.72కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. తదుపరి ప్రతిపాదనలు అటకెక్కాయి.

శంకుస్థాపనకే పరిమితమైన కరుణాపురం టు సింగారం
హైదరాబాద్ జాతీయ రహదారిలోని (కరుణాపురం) నుంచి వరంగల్ ఖమ్మం రోడ్డు(సింగారం) వరకు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల కిందట అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ జీఓ నంబర్ 63 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. కరుణాపురం నుంచి ఖమ్మం రోడ్డులోని సింగారం వరకు 18 కిలోమీటర్ల నిడివితో నిర్మించేందుకు రూ.699కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు జారీ చేశారు. 2017, అక్టోబర్ 22న సీఎం కేసీఆర్ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. నిధులు జీఓకే పరిమితమయ్యాయి.

పెను సవాల్‌గా మారిన భూ సేకరణ
ఔటర్ రింగ్ రోడ్డు భూ సేకరణ పెనుసవాల్‌గా మారింది. ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో భూములను సేకరించేందుకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. రైతులు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో భూ సేకరణకు బ్రేక్ పడింది. జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా చొరవ తీసుకొని భూ సేకరణ, నిధుల విడుదలకు సంకల్పించాల్సిన ఆవశ్యకత ఉందని నగరవాసులు కోరుతున్నారు.

సమస్యల్లో కొన్ని..

- ప్రతిపాదిత రింగ్ రోడ్డుకు కిలోమీటర్ వరకు ఇరువైపులా భూముల ధరలు కాగితాల్లో భగ్గుమంటున్నాయి.
- సాధారణ, మధ్యతరగతి వర్గాల వారికి ధరలు అందనంత స్థాయిలో పెరిగిపోయాయి.
- ప్రతిపాదిత రోడ్డు మార్కింగ్, అలైన్‌మెంట్, స్థల సేకరణ తదితర అనేక అంశాలు సమస్యాత్మకంగా మారాయి.
- ఔటర్ రింగ్ రోడ్డుకు కిలోమీటర్ మేర చాలాచోట్ల భూ కబ్జాలు జరిగాయి.
- రాజకీయ పార్టీల పెద్దలు, బడా బాబులు, చోటామోటా నాయకులు ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. ఆ భూములను స్వాధీనం చేసుకోవడం సవాల్‌గా మారనుంది.
- ప్రజల అవసరాలకు 'కుడా' తమనుంచి వ్యవసాయ భూములు తీసుకొని రియల్ ఎస్టేట్ చేసేందుకు కుట్రలు చేస్తుందని రైతుల భావన. 200 అడుగుల రోడ్డుకు బదులుగా వ్యవసాయ భూములను తీసుకోవడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఓఆర్ఆర్ స్వరూపం ఇలా...
నగరం చుట్టూ మొత్తం పొడవు: 68కిలోమీటర్లు
మొత్తం ఖర్చు: రూ.1,476కోట్లకుపైగా (ఐదేళ్ల కిందటి ప్రతిపాదనల) ప్రకారం
నాలుగు వరుసల వెడల్పు 200 అడుగులు
వేగం: గంటకు 100 కిలోమీటర్లు

రైతులు ముందుకు రావడం లేదు



ఔటర్ రింగ్ రోడ్డుకు డీపీఆర్ సిద్ధమైంది. రోడ్డు నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో భూసేకరణను రైతులు వ్యతిరేకిస్తున్నారు. అందువల్ల ప్రస్తుతం భూ సేకరణ పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.
– అజిత్‌రెడ్డి, కుడా చీఫ్ ప్లానర్

రెప్పపాటులో అనంత లోకాలకు..



కారులో ఇరుక్కుపోయిన మృతదేహం



ఘటనాస్థలిలో లారీ



మృతిచెందిన అరవింద్



మృతిచెందిన రాము



తీవ్రంగా గాయపడిన రణధీర్

వెడ్డింగ్ షూట్ కోసం వెళ్తూ మృత్యు ఒడికి..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సమీపంలో ఘోర ప్రమాదం
- ఘటనా స్థలంలో ముగ్గురు.. ఆస్పత్రిలో ఒకరు మృతి
- మరొకరి పరిస్థితి విషమం.. ఖమ్మం తరలింపు.. వీరంతా ఫొటోగ్రాఫర్లు..
- మృతులంతా ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు

ఇల్లెందు/ఇల్లెందు రూరల్ : వారందరూ మిత్రులు. ఫొటోగ్రఫీ రంగంలో కొనసాగుతున్న వీరు వెడ్డింగ్ షూట్ కోసం కారులో పర్యాటక ప్రాంతమైన ఏపీలోని మోతె వెళ్తున్నారు. మార్గమధ్యలో ఇల్లెందు సమీపాన ఎదురుగా వచ్చిన లారీని వీరి కారు ఢీకొట్టడంతో నలుగురు మృతి చెందారు. కారులో ఉన్న ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఇల్లెందులో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. శుక్రవారం రాత్రి 11గంటల సమయాన జరిగిన ఈ ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులో ఉండడమా, అతి వేగమా అనేది తెలియాల్సి ఉంది. హనుమకొండ జిల్లా కమలాపురం మండలానికి చెందిన రాము, అరవింద్‌లు వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్లుగా పనిచేస్తున్నారు. వీరు ఏపీలోని చింతూరు మండలం మోతెలో ఓ వెడ్డింగ్ షూట్‌లో పాల్గొనేందుకు కమలాపురం నుంచి షిఫ్ట్ కారు(టీఎస్ 03 ఎఫ్‌సీ 9075)లో శుక్రవారం సాయంత్రం బయల్దేరినట్లు తెలుస్తోంది. వీరికి రణధీర్, రుషి, కల్యాణ్ హనుమకొండలో జత కలిశారు. ఆ తర్వాత ఐదుగురు కలిసి మహబూబాబాద్ మీదుగా మోతె వెళ్తుండగా ఇల్లెందు సమీపంలోని జెండాలవాగు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని కారు బలంగా ఢీ కొట్టింది. ప్రమాద ధాటికి కారు ముందు భాగం, ఇంజన్ నుజ్జునుజ్జు కాగా, ఏ భాగానికి ఆ భాగం విడిపోయాయి. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు ప్రమాద స్థలిలోనే మృతిచెందగా, ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు గాయపడిన వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. వెంటనే 108కు సమాచారం ఇవ్వగా గాయపడిన ఇద్దరిని ఇల్లెందు ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ కమలాపూర్‌కి చెందిన అరవింద్ మరణించారు. మరొకరైన నర్సంపేటకు చెందిన రణధీర్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారులోనే ముగ్గురు..
లారీ, కారు వేగంగా వస్తూ ఎదురెదురుగా ఢీకొనడంతో కారు ముందు సీట్లలో కూర్చున్న ఇద్దరికి బలమైన గాయాలై అక్కడికక్కడే చనిపోయారు. ఎయిర్ బ్యాగులు తెరుచుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. సీట్లలో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీసేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. ముందుగా గాయపడిన వారిని తొలుత ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత వెనక్కి వచ్చిన పోలీసులు ముందు సీట్లలో ఇరుక్కున మృతదేహాలను కట్టర్ సాయంతో కారు శిథిలాలను తొలగించి బయటకు తీశారు. కాగా, ఘటనాస్థలిలోనే ముగ్గురు చనిపోవడం, మరో ఇద్దరు అపస్మారక స్థితిలో ఉండడంతో వీరెవరు, ఎక్కడినుంచి ఎక్కడికి వెళ్తున్నారనేది తొలుత గుర్తించలేకపోయారు. ఆ తర్వాత సెల్‌ఫోన్లలో సమాచారం ఆధారంగా కమలాపురం నుంచి మోతె వెళ్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతులందరి వయసు 30 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉంటుంది. కడపటి సమాచారం అందేసరికి ఐదుగురి పేర్లు మాత్రమే తెలిశాయి. వారికి సంబంధించి మిగతా వివరాలపై స్పష్టత రాలేదు. కాగా, కారు రాంగ్‌రూట్‌లో వెళ్లి లారీని ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగినట్లు సమాచారం.

తేజ మిర్చి కొనుగోళ్లకు 14 కేంద్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

ఖిలా వరంగల్: జిల్లాలోని చెన్నారావుపేట, నెక్కొండ, దుగ్గొండి, నల్లబెల్లి, పర్వతగిరి, రాయపర్తి మండలాల్లో తేజ ఎండు మిర్చి కొనుగోళ్లకు 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ గోపి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మార్కెటింగ్, పలు విత్తన కంపెనీలు, వ్యవసాయాధికారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సెర్ప్ డీఆర్‌డీఏ, అక్షర రైతు ఉత్పత్తిదారుల సంస్థ, ఉషోదయ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టాలన్నారు. రైతులు వ్యయ ప్రయాసలకు గురికాకుండా మిర్చిని గ్రామ స్థాయిలోనే కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకునే అవకాశం కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ వాకడే, జిల్లా వ్యవసాయాధికారి పాల్గొన్నారు.

పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటరమణ గౌడ్

నెక్కొండ: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలని, ఇందుకు సంబంధించి విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటరమణ గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జీఓ నంబర్ 317లో స్థానికత ఆధారంగా తీసుకోకుండా కేడర్ సీనియార్టీ ఆధారంగా తీసుకోవడంతో అనేక మంది టీచర్లకు తీరని అన్యాయం జరిగిందన్నారు. దీంతో స్థానికత కోల్పోయి సుదీర్ఘ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాల్సిన గత్యంతరం ఏర్పడిందని వాపోయారు. అలాగే బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌజ్ కేసుల సమస్యను పరిష్కరించి.. భార్యాభర్తలకు ఒకేచోట పనిచేసే విధంగా చూడాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సారయ్య, ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల సతీష్, ఎంఈఓ వి.రత్నమాల, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రంగారావు, జ్యోతిలక్ష్మి, శ్రీధర్, శ్రవణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుసంధానంపై దృష్టి సారించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

ఖిలా వరంగల్: ఓటరు కార్డుతో ఆధార్ నంబర్ అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల సంయుక్త ప్రధాన అధికారి టి.రవికిరణ్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్లను సన్మానించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ నంబర్ అనుసంధానం ప్రశంసనీయంగా ఉందని, అర్బన్ ప్రాంతంలో ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళ్లాలన్నారు. దీనిపై కలెక్టర్ గోపి మాట్లాడుతూ జిల్లాలో 67 శాతం ఆధార్ లింకేజీ పూర్తయిందని, బీఎల్‌ఓలవారీగా రూట్ మ్యాప్ రూపొందించి పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు.

వరిలో వెదజల్లే పద్ధతి మేలు



రాయపర్తి : మాట్లాడుతున్న ఉషాదయాళ్

వర్ధన్నపేట: వరి సాగులో రైతులు వెదజల్లే పద్ధతిని ఎంచుకోవడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణ శివారులోని వరి క్షేత్రాలను పరిశీలించి.. వెదజల్లే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెదజల్లే పద్ధతి ద్వారా ఎకరాకు 2 నుంచి 3 బస్తాలు దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. నారు పోసే అవసరం లేకుండా.. నాటు వేయకుండా ధాన్యం మొలకలను వెదజల్లవచ్చన్నారు. దీంతో కూలీల ఖర్చుతోపాటు నీటి వినియోగం సైతం 30 నుంచి 35 శాతం తగ్గుతుందన్నారు. 10 నుంచి 15 రోజుల ముందు పంట చేతికి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎఫ్‌ఎం కన్సల్టెంట్ పి.సారంగం, ఏఈఓ కావ్య రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు పండించాలి..
రాయపర్తి: రైతులు చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో జిల్లా వ్యవసాయ శాఖ, జాతీయ ఆహార భద్రత మిషన్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023లో భాగంగా శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకు తెగుళ్లు తక్కువని, పురుగు మందులు సైతం అవసరం లేకుండా ఉంటుందన్నారు. ఈ పంటల సాగు వల్ల పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యం లేకుండా ఉంటుందన్నారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ నర్సయ్య, ఏడీఏ సురేష్‌కుమార్, శాస్త్రవేత్తలు రాజు, అనిల్‌కుమార్, ఏఓ వీరభద్రం, మమత, ఏఈఓలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు, రేపు కంటి పరీక్షలు ఉండవు..

- రెండోరోజు 6,142 మందికి పరీక్షలు
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ



చెన్నారావుపేట : కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వెంకటరమణ

గీసుకొండ: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు శని, ఆదివారాలు ఉండవని, వారంలో ఐదు రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. తిరిగి సోమవారం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం జిల్లాలోని 44 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 6,142 మంది పరీక్షలు చేయించుకున్నారని పేర్కొన్నారు. గురు, శుక్ర రెండు రోజులపాటు 11,033 మందికి పరీక్షలు చేయగా.. 3,323 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశామని, 2,262 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు అందించాల్సి ఉందని వివరించారు. 5,447 మందికి కంటి సమస్యలు లేవన్నారు.

మహిళలే అధికం
కాగా.. కంటి పరీక్ష శిబిరాలకు పురుషులతో పోలిస్తే మహిళలే అధికంగా వస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో 4,676 మంది పురుషులు పరీక్షలు చేయించుకోగా.. 6,008 మంది మహిళలు పరీక్షలు చేయించుకోవడం గమనించాల్సిన విషయం. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విషయంలోనూ మహిళలే ముందున్నారని, పురుషులు ఆసక్తి చూపడం లేదని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

అంధత్వ నిర్మూలనకు కృషి
చెన్నారావుపేట/ఖానాపురం/నెక్కొండ: సంపూర్ణ అంధత్వ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. చెన్నారావుపేట పీహెచ్‌సీ, ఖానాపురం, ధర్మరావుపేట గ్రామాల్లోని కంటి వెలుగు శిబిరాలు, నెక్కొండ, దీక్షకుంట, అలంకానిపేట పీహెచ్‌సీ పరిధిలోని అలంకానిపేట కంటి వెలుగు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేసే తీరును పరిశీలించారు. కంటి సమస్య ఉన్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంతకుముందు పీహెచ్‌సీలలో రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమాల్లో జిల్లా ఆప్తాల్మిక్ ఆఫీసర్ ప్రతాపగిరి ప్రసాద్, జిల్లా సూపర్‌వైజర్ రామలింగయ్య, వైద్యులు సరోజ, భూపేష్, రహెలా తన్వీర్, అరుణ్‌కుమార్, కంటి వెలుగు వైద్యులు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట: నియోజకవర్గంలోని రైతులు సబ్సిడీ విద్యుత్ మోటార్లు, పైపులైన్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోనే నర్సంపేట నియోజకవర్గానికి ప్రత్యేకంగా సబ్సిడీ విద్యుత్ మోటారు పథకం మంజూరు చేయించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం అమలు కోసం రూ.3.09కోట్లు కేటాయించిందని, విద్యుత్ మోటార్ పంపు సెట్లు అర్హత గల రైతులకు 50 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర రైతులు కూడా పథకానికి అర్హులని తెలిపారు. రైతులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని సంబంధిత పత్రాలను ఉద్యాన శాఖ అధికారులకు సమర్పించాలన్నారు. గ్రామపంచాయతీ ద్వారా ఆమోదించబడి జిల్లా కమిటీ ద్వారా అర్హులైన దరఖాస్తుదారులకు యూనిట్లను మంజూరు చేస్తారన్నారు. రైతులకు సంబంధిత రైతు వేదిక, మండల కేంద్రం వద్ద కంపెనీ వారి ద్వారా మోటార్లు సరఫరా చేస్తారన్నారు.

వందేభారత్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం జరిగింది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40–45 ఏళ్ల మధ్య వయస్సు, 5.5 ఎత్తు, నీలం రంగు టీషర్టు, గ్రే కలర్‌పాయింట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి హంటర్ రోడ్డు సంతోషిమాత గుడి ఎదురుగా ఉన్న రైలు ట్రాక్‌పై పట్టాలు దాటుతుండగా.. వందేభారత్ రైలు ఢీకొట్టింది. మృతుడి శరీరంలో స్టీల్ రాడ్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు, మృతుడి వివరాలు తెలిస్తే వరంగల్ జీఆర్పీ స్టేషన్ లేదా 94406 04320, 94406 27532 నంబర్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

● స్పెల్‌బీ విజేతలకు ప్రశంసపత్రాల అందజేత

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రీజనల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం రాంపూర్ యూనిట్ కార్యాలయంలో ప్రశంసపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వైద శ్రీనివాస్, ఎడిషన్ ఇన్‌చార్జ్ వర్ధెల్లి లింగయ్య, ఈవెంట్స్ ఇన్‌చార్జ్ సుమన్, ఫొటో జర్నలిస్టు సంపెట వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కామన్ మెస్ రీ ఓపెన్ అయ్యేనా?

- ● కేయూలో నేటితో ముగిసిన సెలవులు
- ● కొనసాగుతున్న మరమ్మతులు

కేయూ క్యాంపస్: కేయూలో పీజీ తదితర కోర్సుల విద్యార్థులకిచ్చిన 11 రోజుల సెలవులు శుక్రవారంతో ముగిశాయి. సంక్రాంతి సెలవుల పేరున హాస్టళ్లు, మెస్‌లలో మరమ్మతుల నేపథ్యంలో సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనెల 21 నుంచి రీ ఓపెన్ చేయాల్సి ఉండగా.. కామన్ మెస్‌లో, పలు హాస్టళ్లల్లో ఇంకా మరమ్మతులు కొనసాగుతున్నాయి. పలు విభాగాల్లో పెయింటింగ్ వేయిస్తున్నారు. కేయూ హాస్టళ్ల కమిటీ చైర్మన్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, పాలక మండలి సభ్యులు పి.మల్లారెడ్డి, కేయూ అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య వాసుదేవరెడ్డి, యూజీసీ కో–ఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి సమావేశమై చర్చించారు. కామన్ మెస్‌ను సందర్శించి పరిశీలించారు. మరమ్మతుల నేపథ్యంలో పీజీ విద్యార్థులకు (బాయ్స్)కు అందులో కామన్ మెస్‌లో మెస్ సౌకర్యాన్ని ప్రారంభించే అవకాశం లేదని గుర్తించారు. మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉండడంతో ఆయా విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా మరోచోట ఏర్పాటు చేయాలని చర్చించారు. అందుకు కేయూ అడ్మిషన్ల డైరెక్టరేట్ లోని స్థలంలో మెస్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనేది కూడా చర్చించినట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం 7గంటల వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే మహిళా హాస్టల్ లోనూ మరమ్మతులు కొనసాగుతున్నాయి. దీంతో రీఓపెన్ ఉంటుందా లేదా? అనేది కూడా యూనివర్సిటీ అధికారులు ప్రకటించలేదు. ఇక సెలవులు పొడిగించవద్దనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కానీ నిర్ణయాన్ని ప్రకటించడం లేదు. సెలవులు ముగిసినందున ఈనెల 21నుంచి తరగతులు యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది ఈనెల 21 నుంచి విద్యార్థులు అయితే క్యాంపస్‌కు చేరుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. సోమవారం వరకు ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. సెలవులు పొడిగిస్తే విద్యార్థుల నుంచి వ్యతిరేకిత వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే 11 రోజులు సెలవులు ప్రకటించినప్పుడే తమకు మూడ్రోజులు సెలవులు చాలు 11 రోజులు వద్దని ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈనెల 21 నుంచి యథావిధిగా పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి స్పష్టం చేశారు.

మరమ్మతులంటూ విద్యార్థులను నిరాకరించిన సిబ్బంది

కాకతీయ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగానికి చెందిన విద్యార్థులు(మహిళలు) సుమారు 12 మంది ఈనెల 21 నుంచి రీఓపెన్ ఉంటుందని భావించి శుక్రవారం సాయంత్రం యూనివర్సిటీకి వచ్చినట్లు సమాచారం. మహిళా హాస్టల్‌కు వెళ్లగా మరమ్మతులు జరగుతున్నాయని లోనికి సంబంధిత సిబ్బంది నిరాకరించడంతో వారు ఆవేదనతో వెనుదిరిగినట్లు సమాచారం. మైక్రోబయాలజీ విభాగాధిపతి తప్పనిసరిగా ఈనెల 21న క్లాస్‌కు హాజరు కావాలని విద్యార్థులకు మెసేజ్‌లు పంపినట్లు తెలుస్తోంది. అయితే మెస్‌లు రీఓపెన్ అవుతాయో లేదో అని కూడా విద్యార్థినులు అనుమానం వ్యక్తం చేసినప్పటికీ మీరు హాజరు కావాల్సిందేనని సమాచారం పంపినట్లు తెలుస్తోంది. దీంతో ఆయా విద్యార్థులు క్యాంపస్‌కు వచ్చినట్లు సమాచారం. సెలవులు ముగిసినందున ఈనెల 21 నుంచి మెస్‌లు రీ ఓపెన్ చేస్తారా? అని కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావును 'సాక్షి' శుక్రవారం సాయంత్రం వివరణ కోరగా.. తాము వివిధ హాస్టళ్ల మెస్‌లను సందర్శించి మరమ్మతులు ఎలా జరుగుతున్నాయో.. పరిశీలించామని తెలిపారు. మహిళా హాస్టల్ మెస్‌లకు ఎలాంటి ఇబ్బంది లేదని, తెరిచే అవకాశం ఉందని బాయ్స్ కామన్ మెస్‌లోనే మరమ్మతులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని శ్రీనివాస్‌రావు వివరణ ఇచ్చారు.

విద్యార్థి, ఉపాధ్యాయులకు కలెక్టర్ అభినందన



సాయిలేఖ్యను అభినందిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్ రూరల్: ప్రతిష్టాత్మక యంగ్ ఇన్నోవేటర్ ప్రోగ్రామ్ (వైఐపీ 2023) కార్యక్రమంలో పాల్గొన్న కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఈ.సాయిలేఖ్య, ఆమెను ప్రోత్సహించిన గైడ్ టీచర్ డాక్టర్ వి.గురునాథరావు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.రమేశ్‌బాబును కలెక్టర్ కె.శశాంక శుక్రవారం అభినందించారు. మహబూబాబాద్ కలెక్టరేట్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, జిల్లా విద్యా శాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి బుచ్చయ్య, జిల్లా విద్యా శాఖ ఏసీజీఈ మందుల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. కాగా.. వైఐపీని హైదరాబాద్‌లో జనవరి 3 నుంచి 13 వరకు సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) నిర్వహించగా.. రాష్ట్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి సాయిలేఖ్య ఎంపికైంది. పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు డాక్టర్ వి.గురునాథరావు ఆధ్వర్యంలో పాల్గొంది.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI / SAKSHI DIGITAL / MEDIA GROUP

SPL / SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR PIPES AND FITTINGS LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 95055 14424
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

నీవెంటే నేను!

- ● మృత్యువులోనూ వీడని బంధం
- ● 24 గంటల వ్యవధిలో అన్నాదమ్ముళ్ల మృతి
- ● లెంకాలపల్లిలో విషాదం



రవీందర్, జలేందర్ (ఫైల్)

నల్లబెల్లి: పసిప్రాయంలో తండ్రిని కోల్పోయారు. ఆ లోటు తెలియకుండా తల్లి వారిని పెంచి పెద్ద చేసింది. బాల్యం నుంచి సోదరులు కలిసి పెరిగారు. ఇప్పుడు 24 గంటల వ్యవధిలోనే ఇద్దరూ మృత్యు ఒడికి చేరుకున్నారు. నీవెంటే నేను అంటూ ఇద్దరూ అనంత లోకాలకు వెళ్లిపోయారు. నల్లబెల్లి మండలం లెంకాలపల్లికి చెందిన రవీందర్ (40), జెలేందర్(37) 24 గంటల వ్యవధిలో మృతి చెందారు. బాల్యంలోనే వీరి తండ్రి వీరయ్య మృతి చెందాడు. కుమారుల్ని తల్లి రాజేశ్వరి కూలీ చేసి పెంచింది. కొంత కాలంగా పెద్ద కుమారుడు రవీందర్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. పది రోజులుగా ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. కాగా.. అన్నను చూసి వచ్చేందుకు జెలేందర్ ఈనెల 18న వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ఆస్పత్రి మెట్లపైనుంచి జారి పడి మృతి చెందాడు. ఈవిషయం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవీందర్‌కు తెలియకుండా కుటుంబ సభ్యులు జలేందర్ దహన సంస్కారాలు పూర్తి చేశారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న రవీందర్ సోదరుడి మృతిని తట్టుకోలేకపోయాడు. అది ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపడంతో వైద్యులు ఐసీయూకు తరలించి మెరుగైన వైద్యం అందించేందుకు యత్నిస్తుండగా మృతి చెందాడు. అన్నాతమ్ముళ్లు 24 గంటల వ్యవధిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తమ కుటుంబాలను వదిలి వెళ్లారా అని కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు.

పలువురి పరామర్శ..

జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. రవీందర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి, నాయకులు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, మేకల లక్ష్మి, కక్కెర్ల శ్రీనివాస్, గన్నెబోయిన చేరాలు, కొత్తపల్లి అశోక్, కస్తూరి రవి, ఆకుల సాంబరావు ఉన్నారు.

బాలిక కిడ్నాప్ కలకలం

- ● కిరాణానికి వెళ్లిన బాలిక.. ముఖానికి కర్చీఫ్ పెట్టి కిడ్నాప్
- ● తప్పించుకుని క్షేమంగా ఇంటికి..
- ● పీఎస్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు.. కేసు నమోదు
- ● కిడ్నాప్ కాదంటున్న పోలీసులు



తల్లి కౌసర్‌బేగంతో కుమార్తె బుతుల్

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే గేట్ ప్రాంతం కాశికుంటలో శుక్రవారం ఉదయం బాలిక కిడ్నాప్ కలకలం రేపింది. పాల ప్యాకెట్ కోసం కిరాణానికి వెళ్లిన 12 ఏళ్ల బాలికను గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకుని మత్తుతో కూడిన కర్చీఫ్ ముఖానికి అడ్డుపెట్టి ఆటోలో కిడ్నాప్ చేశారు. కుమార్తె ఎంతకూ తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కాశికుంటకు చెందిన ఎండి ఇమ్రాన్, కౌసర్ బేగం దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇమ్రాన్ టింబర్ డిపోలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఇమ్రాన్ తల్లి గౌసియా బేగం, అతడి అక్క సాహెదాబేగం వీరు ఇరువురు జక్కలొద్దిలోని సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటైన తాత్కాలిక గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 7.30గంటలకు కౌసర్ బేగం తన కుమార్తె బుతుల్(12)ను పాలప్యాకెట్ తీసుకురమ్మని జన్మభూమి రోడ్డులోని కిరాణం షాపునకు పంపింది. షాపునకు వెళ్తున్న క్రమంలో ముగ్గురు ఆగంతకులు బాలిక ముఖానికి కర్చీఫ్ అడ్డు పెట్టి కిడ్నాప్ చేసి ఆటోలో తీసుకెళ్లారు. కిడ్నాపర్లు ఆటోను వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి మీదుగా వరంగల్ హంటర్ రోడ్డులోని గణపతి కాలేజీ జక్కలొద్ది క్రాస్ రోడ్డు వరకు తీసుకెళ్లారు. అక్కడ కిడ్నాపర్లు టీతాగేందుకు ఆటోను నిలపగా.. మత్తు నుంచి తేరుకున్న బాలిక ఆటో దిగి పరుగు పెట్టింది. అంతలోనే అటుగా వెళ్తున్న గుడిసెవాసులు బాలికను గుర్తు పట్టి ఆటోలో జక్కలొద్ది గుడిసెల్లో నివాసం ఉంటున్న నాన్నమ్మ, మేనత్త సాహెద బేగంకు బాలికను అప్పగించారు. అప్పటికే బాలిక తండ్రి ఇమ్రాన్ డయల్ 100 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీనిపై తల్లిదండ్రులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ అప్రమత్తమై కిడ్నాప్ కేసు నమోదు చేసి పోలీసులను అప్రమత్తం చేశాడు. బాలిక మేనత్త సాహెద్ బేగం ఇమ్రాన్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఇమ్రాన్ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. కిడ్నాపర్ల కళ్లుగప్పి బాలిక తప్పించుకుని క్షేమంగా ఇంటికి చేరడంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు!

బాలిక కిడ్నాప్ ఘటనలో పంజాబ్‌కు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతడిని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. బాలికను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, ఆకుటుంబానికి సన్నిహితంగా ఉండే ఓవ్యక్తి బంధువుల ఇంటి అడ్రస్ చూపించమని బాలికను ఆటోలో తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇదే విషయం బాలిక స్పష్టంగా చెప్పిందన్నారు. ఇమ్రాన్‌కు సరైన సమాచారం లేక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బ్రేక్ బదులు ఎక్సలేటర్ తొక్కాడు!

- ● కారు పూజ కోసం వచ్చి బీభత్సం
- ● ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు ఇదే..

పర్వతగిరి: పర్వతగిరి మండలంలోని ప్రముఖ యాత్రా స్థలం అన్నారం షరీఫ్ దర్గా వద్ద శుక్రవారం కొత్త కారు బీభత్సం సృష్టించింది. ఖమ్మం జిల్లాకు చెందిన రఫీ ఇటీవల కొత్త కారు కొన్నాడు. కారుకు ఫాతెహా (ముస్లిం సంప్రదాయంలో పూజ) చేయించేందుకు షరీఫ్ దర్గాకు వచ్చాడు. దర్గా సమీపంలో కారు నడుపుతుండగా.. భక్తులను తప్పించేందుకు బ్రేక్ వేయబోయి ఎక్సలేటర్ తొక్కాడు. దీంతో కారు మరింత వేగంగా వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న బుచ్చన్న, నందిని, చింటు, దస్రు, మాలతిని ఢీకొట్టడంతో వీరికి గాయాలయ్యాయి. అందులో ములుగు జిల్లా గోస్‌పల్లి గ్రామానికి చెందిన నందినికి ముక్కులో నుంచి రక్తస్రావం కావడంతో నందినితో పాటు గాయాలపాలైన నలుగురిని మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్సై దేవేందర్, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని కారు యజమాని రఫీని అదుపులోకి తీసుకున్నారు. బ్రీతింగ్ టెస్ట్ చేయగా.. అతడు మద్యం తీసుకోలేదని తేలింది. కాగా.. అతడికి లైసెన్స్ ఉన్నట్లుగా ఎస్సై గుర్తించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. క్షతగాత్రులను వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు పరామర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాయమాటలు చెప్పి మైనర్‌తో వివాహం

- ● నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్ రూరల్: ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి బలవంతంగా బాలికను పెళ్లి చేసుకుని అత్యాచారానికి పాల్పడిన వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధి బాలాజీనగర్‌కు చెందిన శీలపాక బన్నిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతడిపై కిడ్నాప్, అత్యాచారం, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వి.సతీశ్‌కుమార్ ఏనుమాముల సీఐ వి.చేరాలు, ఎస్.ఐ శ్రీకాంత్‌పోగుల తెలిపారు.

ఏసీబీ ట్రాప్

- ● లంచం తీసుకుంటూ పట్టుబడిన ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు
- ● వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సుదర్శన్



ఏసీబీకి చిక్కిన డీఈఈ నవీన్



ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ఏసీబీ తనిఖీలు



అబీద్‌ఖాన్

ఏటూరునాగారం: ఏటూరు నాగారం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్‌కు చెందిన ఇద్దరు అధికారులు శుక్రవారం ఏసీబీ వలలో చిక్కారు. 2022 మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో గద్దెలు, సాలహారానికి రంగులు(పెయింటింగ్) వేసిన కాంట్రాక్టర్ సంజీవ వద్ద నుంచి లంచం డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీని ఆశ్రయించాడు. ఐటీడీఏ నుంచి నాలుగు నెలల క్రితమే రావాల్సిన నిధులను ఇంజనీరింగ్ శాఖకు అధికారులు అలాట్ చేశారు. అయినా నాలుగు నెలల నుంచి పెయింటర్‌ను అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. విసిగిపోయిన కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో డీఈఈ నవీన్, ఏఈఈ అబీద్‌ఖాన్ పెయింటర్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అబీద్‌ఖాన్ డ్రాఫ్ట్‌మెన్ అయితే ఏఈఈగా పని చేస్తున్నారు. 15 ఏళ్ల నుంచి ఐటీడీఏలో ఏటూరునాగారం, తాడ్వాయి ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం సమ్మక్క సారలమ్మ 2022 జాతరకు గద్దెలు, ఇతర పెయింటింగ్ పనులను ములుగు గ్రామానికి చెందిన పెయింట్ కాంట్రాక్టర్ సంజీవ పనులు చేశాడు. రూ.16.50 లక్షల బిల్లు ఎంబీ రికార్డు చేసి సదరు కాంట్రాక్టర్‌కు డీఈఈ నవీన్, ఏఈఈ అబీద్‌ఖాన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు రూ. 90 వేలు లంచం ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేశారు. దీంతో సంజీవ ఈనెల 10న ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. మొదటి దఫాగా రూ.50వేలు ఇస్తానని, మిగతావి తర్వాత ఇస్తానని సదరు ఇంజనీరింగ్ అధికారులతో సంజీవ ఒప్పుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయం వద్ద నవీన్, అబీద్‌ఖాన్ డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ. 50వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఏసీబీ డీఎస్పీ, ఏసీబీ సీఐలు శ్యామ్‌సుందర్, రవి, శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ పుటేజీల సేకరణ

ఐటీడీఏ కార్యాలయంలోని సీసీ టీవీ పుటేజీలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంజనీరింగ్ అధికారుల కదలికలు, వారిని ఎవరెవరు కలిశారని ఆరా తీస్తున్నారు. గతంలో ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో కూడా తనకు మేడారం బిల్లులు రావాలని సంజీవ వినతి పత్రం అందించారు.

ఏసీబీ వలలో మొదటిసారి!

ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా పనులు చేయాలంటే గుండెధైర్యంతోపాటు జేబులో డబ్బులుండాలి. బిల్లులు పొందాలంటే కాళ్లకున్న చెప్పులు అరగక తప్పదు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో అనేక బిల్లులను ఆపి కాంట్రాక్టర్లను పీడించి వారి నుంచి లంచాలు పెద్ద మొత్తంలో పొందడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. బిల్లులు సజావుగా రావాలంటే టీఏ, ఏఈఈ, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి పైవరకు చేతులు తడపక తప్పదని ఏసీబీకి చిక్కిన అధికారులను చూస్తే అర్థం అవుతోంది. ఐటీడీఏ కార్యాలయంలో ఏళ్ల తరబడి ఇక్కడే మకాం వేయడంతో ఏ కాంట్రాక్టర్ ఎలాంటి వారు... ఏ పనులకు ఎంత కమీషన్ పొందవచ్చనేది వారికి వెన్నతో పెట్టిన విద్యగా మారింది. ఐటీడీఏలో ఉన్న అధికారులను బదిలీ చేసి ప్రక్షాళన చేస్తే గిరిజనులకు అందాల్సిన ఫలాలు, పథకాలు అందవని చర్చ జరుగుతోంది. ఇంకా ఇలాంటి అవినీతి తిమింగలాలు చాలానే ఉన్నాయని సోషల్ మీడియాలో అనేక మంది కాంట్రాక్టర్లు, బాధితులు పోస్ట్ చేయడం కొసమెరుపు.